


# గిరిజాకళ్యాణం

## నవలారాణి నవలల నేపథ్యం



నేను, నా ఈ 'గిరిజా కళ్యాణం' నవల 1979లో వ్రాసాను. అప్పట్లో శేషాచలం అండ్ కంపెనీ వారికి ప్రతి సంవత్సరం ఏప్రిల్‌లో 'డైరెక్ట్ నవల'గా నా నవల రిలీజ్ అవుతూ ఉండేది. మొదట్లో సీరియల్స్‌గా చదవడానికి అలవాటు పడిన పాఠకులు ఎక్కువ మంది చదవరేమోనని నేను సందేహించాను. పబ్లిషర్స్‌కి చాలా ధైర్యం ఉంది. ఆ సిరీస్‌లో వచ్చిన 'అభిశాపం' అమ్మకాలు అనూహ్యంగా వచ్చినాయి. రీడర్స్ పుస్తకాల పుస్తకాల షాపులకి వెళ్ళి, ముందే డబ్బులు చెల్లించి అడ్వాన్స్ కాపీ రిజర్వ్ చేసుకోవడం జరిగింది. ఇది నాకూ శేషాచలం అండ్ కంపెనీ వారికి కూడా కొత్త ఉత్సాహం ఇచ్చింది. ఆ సిరీస్‌లో వచ్చిన రెండవ నవల 'గిరిజా కళ్యాణం'.

నేను నా చిన్నప్పటి నుంచీ నా చుట్టూవున్న స్త్రీలని గమనిస్తున్నాను. వివాహం అనేది వారికి ఒక పవిత్రమైన బాధ్యత. ఈ బాధ్యత నిర్వహించడంలో ఎన్ని కష్టాలు ఎదురైనా, నూటికి 99.5 మంది వివాహబంధం మాత్రం వదులుకోరు దాన్ని అసహ్యించుకోరు. పెళ్ళిచేసుకున్న వ్యక్తులు దుష్టులు, నీచులు కావచ్చు. కానీ వివాహబంధం మాత్రం స్త్రీకి అత్యంత అవసరమైన అనుబంధం అనే నమ్మకం వారి మనసుల్లో హిమాలయాలంత ఉన్నతంగా, పురాతన శిలలు ఉన్నంత ధ్రుఢంగా ఉండడం నేను అర్థం చేసుకున్నాను. వివాహబంధం పట్ల, చదువురానివారు, వచ్చినవారు, డబ్బున్న స్త్రీలు, లేమిలో ఉన్న స్త్రీలు అందరివీ ఒకటే అభిప్రాయాలు–

నాకిప్పటికీ చాలా గట్టి నమ్మకం, మన దేశ, సామాజిక సంస్కృతి మూలధాతువు స్త్రీయే! ఆమెకి కుటుంబంపట్ల గల దృఢమైన ప్రేమే ఈ సంస్కృతిని చెక్కు చెదరకుండా సంరక్షిస్తోంది. 'పెళ్ళి' అనే మూలంలో కేంద్రబిందువుగా నిలబడిన ఆమె, తన ఇంటిని, సమాజాన్ని, తన సంస్కృతిని, తద్వారా దేశాన్ని తనకి తెలియకుండానే తన సుకుమార భుజద్వయం మీద మోస్తోంది. ఇంట్లో అందరికీ వేళకి అన్నీ సమకూరుస్తూ కొండంత అండగా నిలబడబట్టే మగవారు బైట ప్రపంచంలోకి వెళ్ళి తమ విధుల్ని సక్రమంగా నిర్వర్తించి, ఈ సంఘం అభివృద్ధికి పాటు పడగలుగుతున్నారు. పిల్లలు చక్కగా ప్రశాంతంగా, ఏకాగ్రతగా చదువుకుని, నూతన సమాజశిల్పులుగా మారుతున్నారు. ఇంత అభివృద్ధిని శక్తిగా కాంతికిరణాల్లా వెదజల్లే ఈ స్త్రీలలో నూటికి 99 మందికి అందంలేదు. గ్లామర్ అంటే ఏమిటో తెలియదు. ఆశించరు కూడా. తనకు ఉన్న హక్కుని వినియోగించుకోవాలని కూడా ఎప్పుడూ అనుకోరు. అసలు హక్కులు గురించి తెలుసుకోవాలనే ప్రయత్నమే ఉండదు. కొంత మంది చిలక పలుకులుగా 'స్వతంత్రం' గురించి సంభాషణలు చేసేవారు, ఈమెని మూర్ఖురాలుగా భావించి తక్కువ చూపు చూడడం నాకు తెలుసు. భర్తకి, పిల్లలకి, ఇంటికి వచ్చిన అనుకోని అతిథులని ప్రేమగా,

ఆదరంగా అన్నం పెట్టాలనుకునే తల్లుల్ని మూర్ఖురాలు అనేవారిని ఏమనాలో నాకు మాట దొర్కడం లేదు. నిరంతర శ్రమ, కఠోర, నిస్వార్ధం, కుటుంబం పట్ల ఆమెకిగల అపారమైన ప్రేమ ఈ గుణాలుగల స్త్రీల సముదాయం నిండుగాఉన్న సమాజంలో ఉన్న మనమెంత అదృష్టవంతులం..! మనకి అమ్మ ప్రేమేకాదు, అక్క చెల్లెళ్ళ ప్రేమ, మేనత్త, పిన్నిల ప్రేమ, అమ్మమ్మ, నానమ్మల ప్రేమ, ఇరుగమ్మ పొరుగమ్మల ప్రేమ, చివరికి ఇంటి పనిమనిషిగా వచ్చిన స్త్రీ కూడా 'బుజ్జీ', 'కన్నా' అంటూ మనల్ని ఆదరంగా పిలిచే ప్రేమ. ఇంత లభించే మనం గొప్ప అదృష్టవంతులం కాదంటారా! వివాహ బంధాన్ని ఇంత నమ్మే, ఈమెకి మనం ఏమిస్తే ఋణం తీరుతుంది. నాకెప్పుడు, సాదా సీదా సాధారణ గృహిణిగా కన్పించే స్త్రీయే, నా నవలల కథానాయికలకి పరోక్షంగా మూలధాతువు. నేనెప్పుడూ, ఈమెలో అపారమైన శక్తినీ చూస్తున్నాను.

నాకు తెలిసిన వాళ్ళలో ఒక అమ్మాయికి బాగా ధనవంతుడు అయిన కుర్రాడితో వివాహం అయింది. ఆ అమ్మాయికి బాగా డబ్బుంది. చదువు పెద్దగా లేదు. తల్లితండ్రులకి ఏకైక కుమార్తె. పెద్దలు కుదిర్చిన సంబంధమే, పెళ్ళి వైభవంగా అయింది. తర్వాత వాళ్ళ కాపురం సరిగ్గా లేదని తెలిసింది. అతను గుఱ్ఱపు పందాలంటే పిచ్చి.. స్నేహితుడి చెల్లెలు అంటే చాలా ఇష్టం. తల్లితండ్రులు ఒప్పుకోలేదు. తల్లి ఏడిస్తే, చచ్చిపోతామనని బెదిరిస్తే ఈ అమ్మాయిని చేసుకున్నాడు. కానీ ఆమెని తిరస్కారంగా, అవమానిస్తూ చూసేవాడు. తల్లితండ్రులు రోషపడ్డారు, డైవోర్సు ఇప్పించేయాలని చూశారు. కానీ ఆ అమ్మాయి ఒప్పుకోలేదు. "నేను ఓపిక పడతాను. నాకు విరక్తి కలిగిన రోజున నా మార్గం నేను చూసుకుంటాను. మీరు నాకు లోటు లేకుండా పెళ్ళి చేశారు. మీ బాధ్యత అయిపోయింది. నా జీవితం ఏమిటో నేనే నిర్ణయించుకోవాలి" అని ఖచ్చితంగా చెప్పేసింది. ఆ అమ్మాయి చాలా మామూలు అమ్మాయి. తర్వాత మళ్ళీ చూసాను. పండంటి కొడుకుతో, భర్తతో కనిపించింది. అతను ఆమెను ప్రేమగా చూడడం నాకే ఆశ్చర్యం వేసింది. ఏం జరిగిందో తెలియదు. ఆమె సహనం ఫలించింది. భర్త దగ్గరయ్యాడు. సంసారం ఆనందంగా ఉంది. ఇది ఆ అమ్మాయి ఘనవిజయం అనిపించింది. కొన్ని విజయాలు పొందడానికి కఠోరనిశ్శబ్దం, ఓర్మి చాలా అవసరం అన్న సంగతి తెలుసుకున్నాను. ఆ అమ్మాయే గిరిజాకళ్యాణంలో గిరిజ.

ఈ సంఘటననే నేను నాదయిన శైలిలో నవలగా వ్రాసాను.

ఈ నవల ఏప్రిల్‌లో శేషాచలం అండ్ కంపెనీవారు ప్రథమంగా డైరక్ట్ నవలగా రిలీజ్ చేశారు. తర్వాత చెప్పలేనన్ని పునర్ముద్రణలు వచ్చాయి. ఇది 2007. ఈ నవల 'గిరిజాకళ్యాణం' సినిమాగా (హీరో శోభన్‌బాబు, హీరోయిన్ జయప్రద) వచ్చి నూరు రోజులు ఆడింది. (ఇది 25 సంవత్సరాల క్రిందటి సంగతి). ఇప్పుడు టీ.వీ. సీరియల్‌గా వస్తోంది. అప్పటికీ ఇప్పటికీ తరాలు మారినాయి. అయినా ఈ కథని ఆదరిస్తున్న వారు చాలామంది ఉన్నారంటే, మానవీయ మూలాన్ని తట్టే కోణాలు ఇందులో ఎక్కడో ఉండే ఉంటాయి అనేకదా! లేక, నేను ఆరాధించే మధ్యతరగతి మామూలు స్త్రీకి ప్రతిరూపం. కాబట్టి నాలాగే చాలామంది ఇష్టపడుతున్నారో!



WWW.IWOMAN.IN

ORDINARY WOMAN EXTRAORDINARY POWER

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారు YSSR ఫౌండేషన్ అనే స్వచ్ఛంద సేవా సంస్థని స్థాపించి అనేక సామాజిక సేవా కార్యక్రమాలని నిర్వహిస్తున్నారు. హైదరాబాదులోనీ, ప్రపంచవ్యాప్తంగానూ వున్న అనేకమంది ప్రముఖులు ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. ఈ సంస్థ తరఫున వీధి బాలలసంక్షేమ కార్యక్రమాలూ, వృద్ధుల సంక్షేమకార్యక్రమాలూ, అంగవికలులకు వైద్య సదుపాయాలూ, స్వయం ఉపాధి పథకాల రూపకల్పన, వాటిని అమలుచేయడం లాంటి అనేక కార్యక్రమాలని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఈ సంస్థ కార్యక్రమాల వివరాలకోసం, సేవాకార్యక్రమాల సమగ్రసమాచారంకోసం HTTP://WWW.IWOMAN.IN *(CLICK HERE TO GO THERE)* వెబ్ సైట్‌ని సందర్శించండి. ఈ సంస్థ సేవాకార్యక్రమాల్లో పాల్గొనదలచిన వారు ‘కౌముది‘ ని కానీ, నేరుగా శ్రీమతి యద్దనపూడి గారిని కానీ సంప్రదించ వలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

ఎడిటర్

కౌముది